# ధిక్కారం

ట్రెయిన్ వేగాన్ని పుంజుకోవడంతో చలిగాలి రివ్వున వచ్చి చెంపల్ని తాకింది. అప్పటివరకు దూరమవుతున్న అన్నావదినల వంక చూస్తూ చెయ్యూపుతున్న శ్యామల స్పృహలోకి వచ్చింది. తను ట్రెయినెక్కగానే వదిన కళ్ళల్లో నీరు తిరగడం, అన్నయ్య వదినను మందలించడం గుర్తుకువచ్చాయి. తలుపు బోల్ట్ వేసి లేడీస్ కేబిన్‌లో తన బెర్త్ దగ్గరకు వచ్చిన శ్యామల తన కళ్లు కూడా తడవడం గుర్తించి ఉలిక్కిపడింది. ఏమిటి! తనుకూడా సెంటిమెంటల్ ఫూలవుతుందా?... నో! నో! వదిన కాబట్టి ఈ సెంటిమెంట్స్‌కి దాసురాలవుతూంది కాని తనెప్పటికీ అలాకాదు.

అసలు ముందు నుంచీ వదిన అంతే. తను కాలేజీలో జాయినయినప్పటి నుండీ ప్రతిసారీ ఏడ్చి, కళ్ళు తుడుచుకుంటూనే తనను సాగనంపేది. మరుమల్లె లాంటి తన వదినకు ఎవరూ సాటిరారు. తన స్నేహితురాళ్ళంతా వాళ్ళ వదినలు కసురుకుంటారని, తిడతారని, కొంతమంది కొడతారని కూడా చెప్పేవారు. తన వదిన ఎంత అపురూపంగానో చూసేది తనను! నిజంగా అమ్మే బ్రతికున్నా తననంత ప్రేమగా చూసేది కాదేమో! తామిద్దరి ప్రేమను త్రుంచేయాలని ఎంతమంది కిట్టని వాళ్ల ప్రయత్నించారో! ఎవరెన్ని చెప్పినా తను 'ఛా! మా వదినెంతో మంచిది మా మధ్య తగవులు పెట్టడం మీ తరం కాదు' అని మొహం వాచేలా చివాట్లేసేది. ఇంటర్మీడియట్ వరకు చదివిన వదిన తనకు చదువులో ఎంతో సహాయం చేసేది. ఇంట్లో అన్ని పనులూ నేర్చుకొనే వరకూ చెయ్యనిచ్చేది! తరువాత ముట్టుకోనిచ్చేది కాదు. తనకు తెలిసిన కుట్లూ, అల్లికలూ నేర్పించేది. అన్నయ్య తాహతుకు మించిన కోరికల్ని తనెప్పుడూ కోరక పోయినప్పటికీ, తను వద్దని ఎంత వారించినా తాహతుకుమించి తన గురించి ఖర్చు పెట్టేది వదిన.

కాని వదినలో తనకు నచ్చని దొకటే. చదువుకున్నదే అయినా పూర్వకాలపు మనిషి. మూఢాచారాలన్నిటినీ నమ్మి ఆచరిస్తుంది. తనకు కొంచెం వళ్ళు వెచ్చబడితే చాలు ఉప్పు, మిరపకాయలు, చీపురుకట్ట తీసుకు తయారయేది. ప్రక్కింటి కుర్రాడిని ఆచారిగారి దగ్గిరికి పంపి విభూతి తెప్పించేది. యింకా కొంచెం గాభరా చేస్తే కొత్తగుడ్డ, పసుపు కొమ్ము, వెండిరూపాయి తీసుకుని వెంకటేశ్వరస్వామికి ముడుపు కట్టేది. నెత్తిమీద గంగాదేవి మాటిమాటికి ప్రత్యక్షమయేది. వదినను చూసి తను అల్లరిగా నవ్వేది. ఎగతాళి చేసేది. దిష్టి తీయించుకోడానికి అందకుండా పరుగెత్తేది.

వదినకు పిల్లలు పుట్టడం ఒక మూడు సంవత్సరాలు ఆలస్యమయేసరికి యింక రకరకాల వ్రతాలు, ఉపవాసాలు మొదలు పెట్టింది. రావిచెట్టు చుట్టూ, జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణాలు చేసేది. రంగమ్మ పేరంటాలు తిరణాలకి ప్రాణాచారం పడింది. అన్నయ్యకివన్నీ చిరాకనిపించినా వదిన మంచితనం, అమాయకత్వం, పిల్లలంటే వున్న ఆశ అన్నయ్య నోటిని మూసేసేవి.

యింక బుజ్జిగాడు, చిన్ని పుట్టుకొచ్చాక వదిన చాదస్తం మరీ ఎక్కువయింది. ప్రతి దానికీ శాంతి అనడం, పిలక ఊపుకుంటూ ఒక అరగంటసేపు ఏకధాటిన మంత్రాలు చదివి పంతులుగారు డబ్బులు పట్టుకుపోవడం, ఎల్లమ్మ, పుల్లమ్మ

ఎవరు చెప్పినా సరే తాయెత్తులు తెప్పించి పిల్లల కాళ్లకు, చేతులకు కట్టడం... ఒకరోజు తనకు చిర్రెత్తుకొచ్చి వదిన మీద ఇంతెత్తున లేచింది.

"ఏమిటొదినా? మరీ మతిపోతూంది నీకు. అడ్డమైనవాళ్లు చెప్పినవన్నీ, యిచ్చినవన్నీ పిల్లల వంటి మీదే, చదువుకున్నదానివి, మళ్ళీ యీ మూర్ఖపు నమ్మకా లేమిటి?" తన కోపం చూసి ప్రశాంతంగా నవ్వింది వదిన.

"నీకూ పెళ్ళయి పిల్లలు పుడితే, అప్పుడు తెలుస్తుంది యీ మూర్ఖత్వ మేమిటో."

"ఛ! యీ రెచెడ్ ఆచారాలంటే చెడ్డడోకు నాకు, పిల్లలకు జబ్బు చేస్తే డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళి సరయిన వైద్యం చేయించాలి. తాయెత్తులు కడితేనూ, ముఖం నిండా విభూది మెత్తితేనూ జబ్బు తగ్గుతుందా? ఇదిగో, ఇప్పుడే చెప్తున్నా వదినా! బుజ్జినీ, చిన్నినీ ఊహ తెలిశాక నీ దగ్గర చచ్చినా వుంచను. రోజురోజుకు పెరిగిపోతున్న నీ మూఢ నమ్మకాలతో వాళ్ళ మతి పోగొట్టేలా వున్నావు. వాళ్ళను నా దగ్గర వుంచుకుని అప్‌టుడేట్‌గా తయారు చేస్తాను." తన చిటపటలు చూసి ఫక్కున నవ్వేది వదిన.

"బ్రతికించావు తల్లీ! తీసుకు ఫో! ఎప్పటి దాకానో ఎందుకు! యీ క్షణంలో తీసుకెళ్ళు. అల్లరితో నన్ను తినేస్తున్నారు వీళ్ళు." వదిన నవ్వు చూసి తనవంటికి కారం రాసుకున్న ట్లయేది. తనెంత వాదించినా నవ్వుతూ తను చెయ్యదలచుకున్న పనిని చేసేసే వదిన్ని చూసి విసుక్కునేది.

తను సెలవులకు ఇంటికి వెళ్ళేటప్పటికి కొత్త మత్తులో వుంది వదిన. ఊళ్ళో ఒక బాబాగారి భజనమండలి వెలిసింది, ఆడ, మగ అంతా రోజూ అర్ధరాత్రి దాకా భజన చెయ్యడం, తెల్లవారుజామున నగర సంకీర్తన చెయ్యడం, ఇళ్లల్లో ఎక్కడ చూసినా నిత్య ధూప, దీప నైవేద్యాలతో పూజ చెయ్యడం, ఒక విధమైన నిషాలాగా వుందా భక్తి. ఎప్పుడూ వదినని పల్లెత్తు మాటనని అన్నయ్య వదిన పిచ్చిని చూసి అప్పుడప్పుడూ విసుక్కుంటున్నాడు. బుజ్జిగాడు, చిన్ని పెద్ద ఆరిందాల్లా నుదుట విభూతి పెట్టుకుని తలలూపుతూ, తాళం వేస్తూ భజన చేస్తున్నారు. ఇందంతా చూసి తన తల తిరిగిపోయింది.

ఆ రోజు వదిన వంతు వచ్చి తమ యింట్లో జరిగింది భజన. భజనయ్యాక అంతా ప్రసాదాలు తిని వెళ్లిపోయారు. చివరగా ఆచారి గారు కూడా వెళ్ళడానికి

లేచారు. అప్పటి వరకు బోనులో పులిలా తిరుగుతున్న తను బయటికి వచ్చింది. "కూర్చోండి ఆచారిగారూ! ఈ భజనమండలి ప్రెసిడెంట్ మీరే ననుకుంటాను," సాధ్యమైనంత సౌమ్యంగా అడిగింది తను. లేవబోతున్న ఆచారిగారు కూర్చుండి పోయారు. ముఖం 'ప్రెసిడెంట్' అన్న ముక్క వినగానే విప్పారింది. ఏకాఏకి ఇండియా ప్రెసిడెంట్ అయినట్టు వెలిగిపోతూంది.

"ఏదోనమ్మా! పెద్ద ముండావాడ్నికదా అని నన్నే చేశారు ప్రెసిడెంటుగా" చిత్రంగా సిగ్గుపడ్డారు ఆచారిగారు.

"మొత్తం మీద మంచి భక్తిలో పడ్డారు జనమంతా." తన ఎగతాళిని పాపమా వెర్రి బ్రాహ్మడు గుర్తించలేదు.

"మనదేముంది లేమ్మా పెద్ద పెద్ద ధనవంతులు, గొప్ప గొప్ప చదువులు చదివి మంచి హోదాలో వున్న వాళ్ళు ఎంతో మంది ఆయన భక్తులై సామాన్యుల్లా ఆయన పాదాల దగ్గర కూర్చుని భజనలు చేస్తున్నారు. విదేశాలనుండి కూడా ఎంతో మంది ఆయన దర్శనం కోసం, ఆయన పాదపూజ కోసం తహతహలాడుతూ వస్తున్నారు. అవతార పురుషుడమ్మా ఆ మహామహుడు. ఆయన ఆశ్రమంలో ఆ వైభోగం చూడడానికి రెండు కళ్ళు చాలవు. భక్తులతో కిటకిటలాడుతూ వుంటుంది ఆశ్రమమెప్పుడూ." ఆవేశం సముద్రపు పొంగులా వచ్చింది తనకు. ప్రజల్లోవున్న ముధనమ్మకాల్ని, భగవంతుడంటేనూ, పాప పుణ్యాలంటేనూ ప్రజలకున్న అంధ విశ్వాసాల్నీ ఆధారం చేసుకుని వాళ్ళను ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్న బాబాల్నీ, జపాలనీ, శాంతులనీ డబ్బు పిండుకునే బ్రాహ్మల్నీ వరుసగా నుంచో పెట్టి షూట్ చేసేయా లన్న ఆవేశమొచ్చింది.

"అయితే ఆచారిగారూ! బాబాగారికి చాలా మహిమలున్నాయట కదా! బంగారపు గొలుసులు, ఉంగరాలు, లాకెట్లు, వాచీలు వగైరా చేతిలోకి తెప్పించి భక్తులకిస్తారటగదా! కానీ... అజ్ఞానురాలిని, నాకో సందేహమొచ్చింది. యీ బహుమతులన్నీ శ్రీమంతులూ, హోదాపరులూ అయిన భక్తులకే అందనేల? సామాన్యులంతా నోట్లో వేలేసుకుని ఆ మాజిక్‌ని చూస్తూ కూర్చోనేల?" తన స్వరంలోని కరుకుదనాన్ని కొంచెం గుర్తించారాయన.

"తప్పమ్మా! అలా అనకూడదు. భగవదవతారం! ప్రేమించి ప్రేమలోనే భగవంతుడిని దర్శించమంటాడా మహానుభావుడు. కిట్టని వాళ్ళెవరో అంటూ వుంటారలా" తెగనొచ్చుకున్నారు ఆచారిగారు.

"అబ్బెబ్బే కిట్టని వాళ్ళెవరో కాదండి బాబూ, అయన భక్తులే స్వయంగా సెలవిచ్చారు. భక్తులందరికీ వేదాంత బోధ కావించి వాళ్ళని ముక్తిపథం వైపుకు తరలించే బాబాగారు హమేషా భోగాల మధ్యనే వుంటారని వారే సెలవిచ్చారు." ఎగతాళిగా నవ్వింది తను.

"ఛ! ఛ! ఎవరమ్మా అలా చెప్పింది. ఎవరో ఆయన మహిమని అర్థం చేసుకోలేని వారు మాట్లాడుతూ వుంటారు. ఆయన్ని తిట్టి విమర్శించే వాళ్ళు, ఆయన చేసేదంతా ఒట్టి ఇంద్రజాలం అని తీసిపారేసే వాళ్ళు కూడ ఆయన దర్శనం కాగానే భక్తి మైకం ఆవరించి ఆయన భక్తులయిపోతున్నారు. ఊరూరా, దేశం నలుమూలలా ఆయన భక్తులు న్నారు. వాళ్ళంతా వెర్రివాళ్ళేనంటావా?" ఇలాంటి తెలివివున్న వెర్రివాళ్ళను మార్చడం తన తరం కాదు? ఆవేశాన్ని నిగ్రహించుకుంది తను.

"వ్యక్తిగతంగా బాబా ఎలాంటివారో నాకనవసరం. నా అభ్యంతరమల్లా సామాన్యులంతా ఈ వెర్రిలో పడి తమ కర్తవ్యాన్ని మరచి పోవడమే. మా వదిననే తీసుకుందాం చూడండి. నాకు చదువులో ఎంతో సహాయ పడేది! బుజ్జికి, చిన్నికి తీరిక వున్నప్పుడల్లా చదువు చెప్పేది, ఇప్పుడీ పిచ్చిలోపడి అన్నయ్య సంగతి, పిల్లల సంగతి సరిగ్గా పట్టించుకోవడం లేదు." ప్రసాదాల పళ్లాలు కడిగి లోపల వుంచి తలుపులన్నీ వేసి వచ్చింది వదిన. పని చేస్తున్నా, ఒక చెవి తమ సంభాషణ మీద వేసే వుండి వుంటుంది.

"మనకు తీరిక దొరికినప్పుడల్లా భగవంతుడిని స్మరించుకోవడం తప్పుకాదు శ్యామూ!" అంది వదిన.

"భగవంతుడిని స్మరించుకోవడం తప్పనడంలేదు వదినా! కానీ నీలాగా, నాలాగా కోపావేశాలకి అతీతుడు కాని, ఒక సామాన్య మానవుడుని భగవంతుడిలా కొలిచి ఆత్మవంచన చేసుకోవద్దంటాను. ఈ భజనలూ, నగర సంకీర్తనలూ, అనవసరపు ఆర్భాటాలు, భక్తికి ఇలాంటి ఎడ్వర్టయిజ్‌మెంట్ అనవసరమంటాను" అంది తను.

"ఇది ప్రచారం కాదు తల్లీ. నాస్తికుల్ని ఆస్తికతవైపుకు మరలించడానికి చేసే ప్రయత్నం" అన్నారు ఆచారిగారు.

"చాలా తమాషాగా మాట్లాడుతున్నారు ఆచారిగారూ! ఆస్తికత్వం అంత గొప్పదనుకోను నేను. నాస్తికులేదో పాపులన్నట్లు, ఆ పాప ప్రక్షాళనకి నడుం కట్టాల్సిన

బాధ్యత ఆస్తికులదని, అంత ఔన్నత్యం వారిలో వున్నదని మీరు భ్రమ పడుతున్నట్లుంది. పదిమందిని వంచించే ఆస్తికునికన్నా పదిమందికి ఉపయోగపడే నాస్తికుడెంతో ఉన్నతుడు. ఈ నాస్తికుడే భగవంతునికి దగ్గరివాడు. కాబట్టి ఆచారిగారూ! మనిషి ఔన్నత్యానికి కొలబద్దలు ఆస్తికత్వం, నాస్తికత్వం కాదు. పూజలూ భజనలూ అసలే కావు."తన హేతువాదం, ఆవేశం వదినకు సుపరిచితాలే కనుక చిరునవ్వు నవ్వుతూ వింటూ కూర్చుంది. తన ధోరణి చూసి తల పట్టుకు కూర్చున్నారు ఆచారిగారు.

"మీకు చేతనైతే మనిషిని మంచి మార్గంలోకి తిప్పండి. అలాంటి బాధ్యత పైన వేసుకొవాలంటే మీలాంటి భక్తులంతా ఆ మంచికి ప్రతీకల్లా నిలబడాలి. ఆ సత్తా లేదూ, హాయిగా ఇంట్లో కూర్చోండి. దయచేసి యిలాంటి భజన కాలక్షేపాలతో ప్రజల్ని పనికిరాని వాళ్ళుగా చెయ్యకండి. మా బుజ్జి, చిన్నిలాంటి కసుగాయల్ని అకాలవృద్ధుల్ని చెయ్యకండి. మీలాంటి పండితులూ, పెద్దలూ తలచుకుంటే ప్రజల్ని విజ్ఞానపథం వైపుకు మళ్ళించగలరు. ఆ ప్రయత్నం చేసి చూడండి" తనలాంటి దానితో వాదనెందుకన్నట్లుగా ముఖంపెట్టి యింటికి వెళ్లడానికి లేచారు ఆచారిగారు.

దక్షిణ ఎక్స్‌ప్రెస్ ఒక్క కుదుపుతో ఆగడంతో తన ఆలోచనల్లో నుండి బయటి పడింది శ్యామల. బ్లాంకెట్ తీసుకుని గుండెల వరకు కప్పుకుని అన్నయ్య కొనిచ్చిన మేగజైన్స్ ఒక్కొక్కటీ చూడడం మొదలు పెట్టింది. అప్రయత్నంగా మళ్ళీ వదిన కన్నీళ్లతో ముందు నిలిచింది.

"ఈ రోజు వెళ్లొద్దు శ్యామూ! అందులోనూ వట్టిమనిషివి కూడా కాదు. అమావాస్య, బుధవారంనాడు పుట్టింటినుండి బయల్దేరి వెళ్ళకూడదమ్మా. ఈ ఒక్కసారికీ నామాట విను." అంటూ వదిన ప్రాధేయపడింది.

"ఫో వదినా! నీకు మరీ చాదస్తం ఎక్కువయిపోతూంది. అమావాస్య, బుధవారమయితే ఏమవుతుందేమిటి? ఏదన్నా అవాల్సివుంటే యింకో రోజు వెళ్తే మాత్రం అవదా? మనల్ని ఆపద నుంచి కాపాడేది మన ఋజువర్తనం కానీ వారం, వర్జ్యం, తిథి, నక్షత్రాలు కాదు. ఈ రోజు రిజర్వేషన్ దొరికింది. ఈ రోజే వెళ్తాను. ఇవన్నీ చూస్తూ కూర్చుంటే మనం ఒక్క అడుగు కూడా ప్రోగ్రెస్ అవలేం." అని వదిన మాటను కొట్టిపారేసి బయల్దేరింది. అన్నయ్య కూడా తన మాటలకు వత్తాసిచ్చి నవ్వడంతో వదిన ఉక్రోష పడింది. వదిన గురించే ఆలోచిస్తూ నిద్రాదేవి కౌగిలిలోకి జారిపోయింది శ్యామల.

***

దక్షిణ ఎక్స్‌ప్రెస్‌లో ఇటార్సీ వరకు, అక్కడినుండి బాంబే హౌరా మెయిల్లో పాట్నావరకు ఒంటరిగా ప్రయాణం చెయ్యడం చాలా యిష్టం శ్యామలకు. చిక్కని చీకటితో నిండిన టనెల్స్‌లో నుండి ట్రైన్ వెళ్తుంటే గమ్మత్తుగా వుంటుంది. తలుపు దగ్గర నిలబడి పాములా మెలికలు తిరుగుతూ పోతున్న ట్రెయిన్‌నీ, ముదురాకు పచ్చచీర కట్టుకున్న ప్రకృతినీ చూస్తూ వుంటే టైమ్ తెలియదు. పాట్నాలో ఎమ్.ఎస్. చేస్తున్న భర్త ఆమె టెలిగ్రామ్‌ను చూసుకుని ఒకోసారి మొఘల్ సరాయిలోనూ, ఒకోసారి దానాపూర్‌లోనూ కలుస్తూంటాడు. మొఘల్‌సరాయి స్టేషన్ నుండి అతనికోసం ఉత్కంఠతో ఎదురుచూడడం థ్రిల్లింగ్‌గా వుంటుంది శ్యామలకు. అతనొచ్చిన దగ్గర్నుండి పాట్నాలో దిగేవరకు అతనికిష్టమని వదిన చేసిచ్చిన చేగోడీలు నములుతూ అతనితో కబుర్లు చెప్పడమంటే మహా సరదా శ్యామలకు. అలహాబాద్ దాటిన దగ్గర్నుండి శ్యామల ఆలోచనలు ఆంధ్రప్రదేశ్‌ని వదిలి బీహార్ వైపు పరుగెడుతాయి. నేల యీనిందన్నట్లుగా అస్తమానం జనంతో కిక్కిరిసి పోయే పాట్నా జంక్షన్, నునుచీకటిలో సన్నటి మంచుతెరల్లో ఓవర్ కోట్ తొడుక్కుని ఒకరినానుకుని ఒకరు నడుస్తూ 'అష్నాబజార్'లో ఓ చెక్కర్ కొట్టి 'ఎలిఫెన్‌స్టోన్'లో మంచి హిందీ ఫిల్మ్ చూడడం, గాంధీ మైదానంలో కూర్చుని మొక్కజొన్న పొత్తులు తింటూనో, చిన్న పుల్లలకి అంటించిన ఐస్‌క్రీమ్ నాకుతూనో కబుర్లు చెప్పుకోవడం, మెడికల్ కాలేజి లైబ్రరీ ప్రక్కన రేవు మెట్ల మీద కూర్చుని అమితమైన వేగంతో చెట్లూ చేమల్నీ కోసుకుని భయంకరంగా పరుగెత్తే వర్షాకాలపు గంగాదేవిని చూడడం, శీతాకాలంలో చల్లని తల్లిలా ప్రశాంతంగా ప్రవహించే గంగ ఆవలితీరానికి బోట్‌లో షికారు వెళ్లడం, పాటలీపుత్ర కాలనీలో తమ చిన్ని పోర్షన్ ముందు చలి ప్రదేశాల్లో పెరిగే రకరకాల సీజనల్ ప్లాంట్స్ విరగబూస్తే వాటి అందాల్ని చూస్తూ మైమరచి పోవడం... యివన్నీ గుర్తుకు వస్తాయి శ్యామలకు. బ్రిటిష్ లైబ్రరీలో తను చదివేసిన పుస్తకాలూ, వెళ్ళాక చదవాల్సిన పుస్తకాలలిస్టూ కళ్ల ముందు నిలుస్తాయి.

రాజ్‌ఘీర్‌లో 'రోప్‌వే', హాట్ స్ప్రింగ్స్, నలందా యూనివర్సిటీ శిధిలావశేషాలు, పావాపురి జైనమందిరపు శోభ - ఇవన్నీ ఒక్కసారి కళ్ళల్లో మెదులుతాయి. కాని వీటితోపాటు అనుకోకుండా ఆమెకు చిరాకు కలిగించే విషయాలు కూడా గుర్తుకొస్తాయి. తన భర్త రాఘవరావు అన్ని విషయాల్లో మంచివాడు. కాని అతనికి కాస్త చాదస్తం, విపరీతమైన భగవద్భక్తి వున్నాయి. సర్జరీ బుక్స్, తప్పితే రకరకాల రచయితలు వ్రాసిన గీత, భవాన్స్ జర్నల్, వివేకానంద స్పీచెస్, అరవిందాస్ భక్తి

యోగ లాంటివి మాత్రమే చదువుతాడని చిరాకు పడుతుంది శ్యామల. గంగ ఒడ్డుకు షికారుకు వెళ్తే తప్పకుండా గంగలో కాళ్ళు కడుక్కుని ఒక నిమిషంసేపు భక్తిగా కళ్ళుమూసుకుని చేతులు జోడించి గంగాదేవికి నమస్కరించి మరెంతో భక్తితో పవిత్ర గంగాజలాన్ని మూడుసార్లు లోపలికి పుచ్చుకుంటాడు. అది చూసిన శ్యామల ఒళ్ళు జలదరిస్తుంది. ప్రక్కనే బట్టలుతకడం, అక్కడే స్నానం చెయ్యడం, చాలా తరచుగా కాలీకాలని శవాలు కొట్టుకు రావడం చూచికూడా ఇతను ఇంత భక్తిగా ఈ నీళ్ళనెలా త్రాగగలుగుతున్నాడబ్బా అని ఆశ్చర్యపోతుంది శ్యామల. అతనిలోని డాక్టరు ఇవి ఆరోగ్య సూత్రాలకు విరుద్ధమని హెచ్చరించడంలేదా అని ఆలోచిస్తుంది. అతనితో మతం పేరిట, దేవుడి పేరిట దేశంలో జరుగుతున్న అన్యాయాల గురించి మనుషుల ఆలోచనల్లో పాతుకు పోతున్న ఛాందస భావాల గురించి అలుపు లేకుండా గంటల తరబడి వాదిస్తుంది.

"శ్యామూ" తనను చూసిన ఆనందాన్ని దాచుకోలేక తన చేతినందుకున్న భర్తను చూసేవరకు ఆలోచనల్లో నుండి బయట పడలేదు శ్యామల.

"ఏ స్టేషనిది?" ఆప్యాయంగా రాఘవరావు వంక చూసింది శ్యామల.

"దానాపూర్"

"అప్పుడే దానాపూర్ వచ్చేసిందా? ఆలోచనల్లో టైమే తెలీలేదు." అంది శ్యామల కిటికీలో నుండి తలపెట్టి స్టేషన్‌కి అటూ ఇటూ చూస్తూ. మట్టికప్పుల్లో గరమ్ చాయ్‌ని ఊదుకుంటూ త్రాగుతున్నారు చాలామంది.

"అబ్బో! ఇలా అయిపోయారేమిటండీ. అసలా సౌత్ ఇండియన్ మెస్ వాడు కారియర్ పంపిస్తున్నాడా లేదా? ఎప్పుడూ చదువు తప్పితే, తిండి గురించి శ్రద్ధలేదు మనిషికి." భర్తను పరిశీలనగా చూసి అందంగా విసుక్కుంది శ్యామల. శ్యామల విసుగుచూసి నవ్వాడు రాఘవరావు.

"నీ తిట్లు వినక నాకు నిద్ర పట్టడం లేదు శ్యామూ. అందుకే చిక్కి పోయాను, ఇదిగో ఇప్పుడు మొదలు పెట్టావు కదా, ఇంటికి వెళ్ళగానే గాఢంగా, సంతృప్తిగా నిద్రపోతాను. దాంతో తెగ బలిసిపోతాను." కెరటాలు విరిగి పడినట్లుగా నవ్వాడు రాఘవరావు. అతని నవ్వు చూసి మూతి ముడిచింది శ్యామల.

"అసలు నువ్వివాళ వస్తావనుకోలేదు శ్యామూ! అమావాస్య పూట బయల్దేర తావా అనుకున్నాను." రాఘవరావు మాటలు వినగానే కోపం నసాళానికంటింది శ్యామలకు.

"ఇలాంటి నమ్మకాలంటే నాకు చెడ్డ అసహ్యమని తెలుసు మీకు. ఏం? అమావాస్య పూట బయల్దేరితే ఏమవుతుంది?" ఖస్సుమంది శ్యామల. పొరపాటున నోరు జారినందుకు లోలోనే లెంప లేసుకుని గప్‌చిప్‌గా అయిపోయాడు రాఘవరావు. రాఘవరావు ముఖం చూసేసరికి జాలేసింది శ్యామలకు.

"యిలాంటి ఛాదస్తపు మాటలు మట్లాడారంటే ఈసారి మీకు విడాకులిచ్చేసి హిమాలయాస్‌కి తరిమేస్తాను." నెలవంక ఉదయించినట్లుగా నవ్వింది శ్యామల. రైలు కూతేసి ముందుకు సాగింది.

***

వారం రోజుల నుండి ముసురు. తాతలనాటి యిల్లేమో, పెంకు లేయించి చాన్నాళ్ళయి అక్కడక్కడ తడుస్తూంది. పాప ఉయ్యాల చినుకులు పడకుండా సర్ది చలి తగలకుండా పాపకు టోపీ, స్వెట్టర్ వేసింది శ్యామల, పాప వంక తదేకంగా చూసి నిట్టూర్చింది. పుల్లల్లా వున్న కాళ్ళూ, చేతులూ, తెల్లగా పాలిపోయిన చెక్కిళ్లు. కాంతి తరిగిన కళ్ళు, చైతన్యం లేని బొమ్మలా నిశ్చలంగా పడుకున్న ఆ తీరు చూసి ఒక్కసారి దుఃఖం ముంచు కొచ్చింది. ముఖం తిప్పుకొని కన్నీళ్ళు తడుచుకుని కిటికీ దగ్గర కొచ్చి వర్షపు ధారల్ని చూస్తూ నిల్చుంది. పాప ఏడుపు విని యాంత్రికంగా వచ్చి పాపని చేతుల్లోకి తీసుకుంది. పాప చేతులకూ, కాళ్ళకూ, మెళ్లోనూ వున్న తాయెత్తులు చేతికి తగిలాయి. వీటినన్నింటిని చూసి విరక్తిగా తల విదిలించింది. ఏడుపునాపి శూన్యంగా చూస్తున్న పాపను చూసి పాలపొంగు లాంటి ఆవేశం కదలి పాపను గాఢంగా హృదయానికి హత్తుకుంది. జలజలా కన్నీళ్లు రాలి పాప తలను తడుపుతున్నాయి. "శ్యామూ!" పాపకు పాలు కలిపి తీసుకొచ్చిన లక్ష్మి శ్యామలవంక జాలిగా చూసింది.

"ఏమిటిలా పిచ్చిదానివై పోతున్నావు రోజురోజుకీ! మనం చెయ్యగలిగింది చేస్తున్నాం. వైద్యమయితే చేయించగలం కాని ఆయుష్షు పోయగలమా చెప్పు? చూడు శ్యామూ! ఎప్పుడూ కంటతడిపెట్టని దానివి నువ్విలా ఏడుస్తుంటే నాకేడుపొస్తుంది." పాపకి పాలు పట్టడానికి కాళ్లమీద వేసుకుంది లక్ష్మి. శ్యామల నిర్జీవంగా పాపవంక చూస్తూ కూర్చుంది.

"శ్యామూ! నీకిష్టంలేని పనులన్నీ చేస్తున్నానని నా మీద కోపంగా ఉందా? ఏం చెయ్యను? డాక్టర్లిచ్చే మందులో, తాయెత్తులో, మంత్రించిన విభూతో, ఏదో ఒకటి పాపని బాగుచేస్తే, నీ ముఖంలో మునుపటి నవ్వు చూడాలని నా ఆశ."

పెదాలు బిగించుకొని పడుకున్న పాపచేత ఎలాగైనా పాలు త్రాగించాలని ప్రయత్నిస్తూంది లక్ష్మి.

శామల హృదయం రణరంగంలా వుంది. "వదినా! మునుపటి శ్యామూ చచ్చిపోయింది. హైదరాబాద్‌లో డాక్టర్ గిరీష్, పాట్నాలో డాక్టర్ ప్రసాద్ ఎప్పుడైతే పాపను చూసి పెదవి విరిచారో, ఎప్పుడయితే నాకు పుట్టపోయే బిడ్డలకు కూడా ఇలాంటి వ్యాధే వచ్చి చనిపోయే అవకాశం వుందని అభిప్రాయం వెలిబుచ్చారో, అప్పుడే చచ్చిపోయింది నీ శ్యామూ. ఈ భయంకరమైన వ్యాధి కబంధహస్తాల్లో నలిగిపోతున్న నా పాపను, మృత్యువుతో అనుక్షణం పోరాడుతున్న పాపను నిస్సహాయంగా చూస్తూ శారీరకంగా కూడా నేనెందుకు చచ్చిపోలేదా అని బాధ పడుతున్నాను. వదినా! ఎప్పుడూ నీ అచారాల్నీ, నమ్మకాల్నీ ఎగతాళి చేసేదాన్ని కదూ! తాయెత్తుల్నీ, విభూతినీ బుజ్జికి, చిన్నికి దూరంగా వుంచమని నీతో దెబ్బలాడే దాన్ని కదూ! అమావాస్య, పౌర్ణమి, పాపం, పుణ్యం డామ్ నాన్సెన్స్ అని పెద్ద గొప్పగా నీతో వాదించేదాన్ని కదూ! ఇప్పుడు పాపకి నువ్వు ఎక్కడెక్కడివో తాయెత్తులు తెప్పించి కడుతుంటేనూ, గంటకో రకం విభూతిని, కుంకుమను నుదుట పెడుతూంటేనూ, నాకు ఇష్టం లేకపోయినా నీ కోసం సహిస్తున్నానను కుంటున్నావు కదూ! నువ్వు పాప ఆరోగ్యం కోసం పూజలు, భజనలు, ఫాదరీలతో ప్రార్థనలు చేయిస్తూంటే నాకు నమ్మకం లేకపోయినా నిన్ను కష్టపెట్టడం ఇష్టంలేక చూస్తూ వూరుకుంటున్నానని అనుకుంటున్నావుకదూ! పిచ్చి వదినా! సైంటిఫిక్‌గా ఏ ఆశాలేదని నిర్ణయించుకున్నాక, నువ్వు చేసే పనుల్లో యేవొక్కటన్నా ఫలించి పాప ఆరోగ్యం బాగుపడుతుందేమోనని తల్లిగా అంతరాంతరాల్లో ఆశ పడుతున్నా నని నీ కెలా చెప్పను? మానవుడిలోని స్వయంకృషిని తప్పితే, మనిషిలోని మంచితనాన్ని తప్పితే అదృష్టం, దురదృష్టం, విధి అనే వాటిని నమ్మని నేను పాప నీ పూజల ఫలితంతోనైనా, నీ నమ్మకాల బలంతోనైనా కోలుకుని చిరునవ్వులు చిందిస్తుందేమోనని నీ చేతుల్లో పెట్టి పేరాశతో ఎదురు చూస్తున్నానని నీకెలా చెప్పను!" మౌనంగా కన్నీళ్ళు పెట్టుకుంటూ కూర్చున్న శ్యామల ఒక్కసారి భోరుమన డంతో లక్ష్మి కంగారు పడింది. అప్రయత్నంగా తనూ ఏడవడం మొదలు పెట్టింది.

కొంచెంసేపు కన్నీళ్ళు కార్చాక హృదయంలోని భారం కొంత వరకు తగ్గినట్ల యింది. మళ్లీ ఊపిరి సలపనివ్వని ఆలోచనలు శ్యామలను చుట్టుముట్టాయి. కొండంత కష్టం వస్తే తట్టుకుని ధైర్యంగా నిలబడాలి కాని, తన నమ్మకాల్ని కోల్పోయి ఏడుస్తూ కూర్చునేంత దుర్బలురాలా తను! 'సెరిబ్రల్‌పాల్సీ' వచ్చిన పాపని

తాయెత్తులు, ప్రార్థనలు, బాబాల ఆశీర్వచనాలు రక్షిస్తాయేమోనని ఆశపడేంత వెర్రిదయిందా తను. నో! పాప బ్రతకదు. అది నిజం. తన గర్భశోకాన్ని ఎవరూ, ఏమహత్తులూ తీర్చలేవు? తన హృదయంలోని యీ వెలితిని పూడ్చు కోవడం తనకు శక్తికి మించిన పని... ఈ వెలితిని పూడ్చుకోవడానికి తను ప్రయత్నం చెయ్యాలి. తనలో ఉవ్వెత్తున ఎగసి వస్తున్న శోకానలాన్ని ఆర్పడానికి తను విశ్వప్రయత్నం చెయ్యాలి. తను ఎప్పటిలానే తన చిరునవ్వుల్నే నలుగురికీ పంచాలి కాని తన కన్నీటిని కాదు. తను ఎప్పటిలానే యీ మూఢాచారాల్నీ, చాందసభావాల్ని, మనిషి ప్రగతికి ప్రతిబంధకంగా వున్న మతపు మత్తును ధిక్కరించాలి. మనిషిలోని మంచితనాన్ని, మానవత్వాన్ని మాత్రమే ఎలుగెత్తి చాటాలి. చీకటి లాంటి తన బలహీనత క్షణికమే అయి గతంలో కలిసిపోయి, ధైర్యపు వెలుగు తన అణువణువులో, తన కనుపాపలలో నిండి భవిష్యత్తులోకి నడిపించాలి.

కళ్ళు తుడుచుకుని లక్ష్మి కాళ్ళమీదనున్న పాపను తీసుకుని తన ఒడిలో పొదవుకుని ఒక్కొక్క తాయెత్తునూ విప్ప సాగింది శ్యామల.

- 'యువజన', 1977